


# నెరవేర్చుట

**లోక రక్షకుడైన యేసయ్య నామమునకు మహిమ కలుగును గాక!**

**మూలవాక్యం : మత్తయి 3:15** యేసు ఇప్పటికి కానిమ్ము; **నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చెను** గనుక అతడాలాగు కానిచ్చెను.

ప్రభువైన యేసుక్రీస్తు పుట్టుక, వృత్తాంతం, మత్తయి, లూకా సువార్తికులు మనకు విడమర్చి వ్రాస్తే మార్కు, యోహానులు ఆయన బాప్తిస్మము, పరిచర్య వృత్తాంతాన్ని వారి సువార్తల ప్రారంభములోనే విశదీకరించారు. ప్రభువైన యేసుక్రీస్తు బాప్తిస్మము పొందటానికి బాప్తిస్మమిచ్చు యోహాను దగ్గరకు వచ్చారు. ఈ బాప్తిస్మమిచ్చు యోహాను ప్రభువు యొక్క మార్గాన్ని సరాళ పరచటానికి ప్రభువు కంటె ముందుగా పంపబడ్డాడు.

బాప్తిస్మమిచ్చు యోహానును పంపిన దేవుడు ప్రభువైన యేసుక్రీస్తును గుర్తించడానికి కొన్ని గుర్తులు చెప్పి పంపించారు. ఆత్మ పావురము వలె ఆకాశము నుండి దిగి వచ్చి ఎవరి మీద నిలుచునో ఆయనే దేవుని కుమారుడని, ఆయన చెప్పులు వారు విప్పుటకు కూడ తాను యోగ్యుడను కాను అని చెప్పారు.

బాప్తిస్మము పొందటానికి ప్రభువైన యేసు యోహాను దగ్గరకు వచ్చినప్పుడు యేసుతో **"నేను నీ చేత బాప్తిస్మము పొందవలసిన వాడనై యుండగా నీవు నా యొద్దకు వచ్చుచున్నావా"** అని నివారింప జూచెను. అప్పుడు యేసు **"ఇప్పటికి కానిమ్ము నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని"** యోహానుతో చెప్పెను.

నెరవేర్చుట అనగా ఏదైతే నిర్దేశింపబడిందో, నియమింపబడిందో ఆ ప్రణాళికను తూ.చ తప్పకుండ పాటించటం. మనకు ఇవ్వబడిన పనిని నిబద్ధతతో చేయటం. ఇష్టమూ, కష్టమూ అన్న మాట లేకుండ దేవుని చిత్తమే నా ఇష్టమని చేయడం.

1. **ప్రభువైన యేసు క్రీస్తు నీతి యావత్తును నెరవేర్చుటకు వచ్చారు, నెరవేర్చారు: మత్తయి 3:15** యేసు ఇప్పటికి కానిమ్ము; **నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చెను** గనుక అతడాలాగు కానిచ్చెను.
2. **ప్రభువైన యేసు క్రీస్తు ధర్మశాస్త్రమును నెరవేర్చుటకు వచ్చారు, నెరవేర్చారు: రోమా 13:8** ఒకనినొకడు ప్రేమించుట విషయములో తప్ప మరేమియు ఎవనికిని అచ్చియుండవద్దు **పొరుగు వానిని ప్రేమించువాడే ధర్మశాస్త్రము నెరవేర్చినవాడు.**
3. **ప్రభువైన యేసు క్రీస్తు లేఖనము నెరవేర్చుటకు వచ్చారు, నెరవేర్చారు: లూకా 4:21** సమాజ మందిరములో నున్న వారందరు ఆయనను తేరిచూడగా, **ఆయన నేడు మీ వినికిడిలో ఈ లేఖనము నెరవేరినదని వారితో చెప్పసాగెను.**
4. **ప్రభువైన యేసు క్రీస్తు ప్రవక్తల చేత వ్రాయబడిన మాటలు నెరవేర్చుటకు వచ్చారు, నెరవేర్చారు: లూకా 18:31** ఆయన తన పండ్రెండుమంది శిష్యులను పిలిచి ఇదిగో యెరూషలేమునకు వెళ్లుచున్నాము; **మనుష్య కుమారుని గూర్చి ప్రవక్తల చేత వ్రాయబడిన మాటలన్నియు నెరవేర్చబడును.**




5. **ప్రభువైన యేసు క్రీస్తు దేవుని చిత్తము నెరవేర్చుటకు వచ్చారు, నెరవేర్చారు: యోహాను 6:39** నా యిష్టమును నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; **నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే పరలోకము నుండి దిగి వచ్చితిని.**
6. **ప్రభువైన యేసు క్రీస్తు దేవుని పని నెరవేర్చుటకు వచ్చారు, నెరవేర్చారు: యోహాను 17:4** చేయుటకు **నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమిమీద నిన్ను మహిమ పరచితిని.**
7. **ప్రభువైన యేసు క్రీస్తు ఆయనను గూర్చి వ్రాయబడినవి నెరవేర్చుటకు వచ్చారు, నెరవేర్చారు: అపో.కా 13:29** వారు **ఆయనను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేర్చిన** తరువాత ఆయనను మ్రాను మీద నుండి దింపి సమాధిలో పెట్టిరి.
8. **ప్రభువైన యేసు క్రీస్తు పితరులకు చేసిన వాగ్దానము నెరవేర్చుటకు వచ్చారు, నెరవేర్చారు: అపో.కా 13:32** దేవుడు యేసును లేపి, **పితరులకు చేసిన వాగ్దానమును మన పిల్లలకు నెరవేర్చియున్నాడని** మేమును మీకు సువార్త ప్రకటించు చున్నాము.

**ALERTS** :- **పరిచర్యను నెరవేర్చుటలో జాగ్రత్త :**

కొలస్సి 4:17 మరియు ప్రభువు నందు **నీకు అప్పగింపబడిన పరిచర్యను నెరవేర్చుటకు** దాని గూర్చి జాగ్రత్త పడుమని అర్ఖిప్పుతో చెప్పుడి.

**మరియు యేసయ్య తన జీవితంలో నెరవేర్చిన భాధ్యతలు :-**

1. **కుమారునిగా తల్లిదండ్రులకు లోబడ్డారు,మరియు వారి బాధ్యతలు నెరవేర్చారు : లూకా 2:51** అంతట ఆయన వారితో కూడ బయలుదేరి నజరేతునకు వచ్చి వారికి లోబడియుండెనుఆ .న తల్లి ఈ సంగతులన్నిటిని తన హృదయములో భద్రము చేసికొనెను.

   **యోహాను 19:26,27** యేసు తన తల్లియు తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచుండుట చూచి అమ్మాయిదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను, తరువాత శిష్యుని చూచి యిదిగో నీ తల్లి అని చెప్పెను; ఆ గడియనుండి ఆ శిష్యుడు . .ఆమెను తన యింట చేర్చుకొనెను
2. **మనష్య కుమారుడిగా పాపములు క్షమించారు, స్వస్థపరిచారు:-** మత్తయి 9:6 అయినను పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్యకుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెను అని చెప్పి ఆయన పక్షవాయువుగలవాని చూచినీవు లేచి నీ మంచ మెత్తికొని నీ యింటికి పొమ్మని చెప్పగా
3. **దేవుని కుమారుడిగా మృతులలో నుండి ప్రథమ ఫలముగా లేచారు :-** రోమా1: 2-7 యేసుక్రీస్తు, శరీరమునుబట్టి దావీదు సంతానముగాను, మృతులలోనుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను.
4. **యూదునిగా సాతానుకు నమస్కరించలేదు :-** మత్తయి 4:9,10 నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసినయెడల వీటినన్నిటిని నీకిచ్చెద నని ఆయనతో చెప్పగా. యేసు వానితోసాతానా, పొమ్ముప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడియున్నదనెను.




మొర్దెకై యూదుడు గనుక మంత్రియైన హామానుకు నమస్కరించలేదు(ఎస్తేరు3:2-4). షద్రకు, మేషాకు, అబెద్నెగోలు యూదులు గనుక నెబుకద్నెజరు చేయించిన బంగారు ప్రతిమకు నమస్కరించలేదు(దానియేలు3:12), యేసుక్రీస్తు యూదుడు గనుక సాతానుకు నమస్కరించలేదు. యూదులు దేవునికి తప్ప మరెవ్వరికి నమస్కారము చేయరు(ద్వితీ5:8,9).

5. **బోధకునిగా సమాజమందిరములలో బోధించారు :** మత్తయి 4:23 యేసు వారి సమాజమందిరములలో బోధించుచు, (దేవునిరాజ్యమును గూర్చిన సువార్తను ప్రకటించుచు (, ప్రజలలోని ప్రతి వ్యాధిని, రోగమును స్వస్థపరచుచు గలిలయయందంతట సంచరించెను.

   మత్తయి 7:29 ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారముగలవానివలె వారికి బోధించెను.

6. **ప్రవక్తగా ఎదుటి వారి బలహీనతలు బయలు పరచి వారిని సరిదిద్దారు :- యోహాను 4:18,19** నీకు అయిదుగురు పెనిమిట్లుండిరి, ఇప్పుడు ఉన్నవాడు నీ పెనిమిటి కాడు; సత్యమే చెప్పితివనెను. అప్పుడా స్త్రీ అయ్యా, నీవు ప్రవక్తవని గ్రహించుచున్నాను.

7. **మధ్యవర్తిగా దేవునికి మానవులకు సమాధానము కలుగజేశారు:-** 1 తిమోతి2:5 దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్య వర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు.

8. **యాజకునిగా, ప్రధాన యాజకునిగా, ఒక్కసారే తన్నుతాను బలిగా అర్పించుకున్నాడు :-** హెబ్రీ7: 27,28 ధర్మశాస్త్రము బలహీనతగల మనుష్యులను యాజకులనుగా నియమించును గాని ధర్మశాస్త్రమునకు తరువాత వచ్చిన ప్రమాణపూర్వకమైన వాక్యము నిరంతరమును సంపూర్ణ సిద్ధిపొందిన కుమారుని నియమించెను గనుక ఈయన ఆ ప్రధానయాజకులవలె మొదట తన సొంత పాపములకొరకు తరువాత ప్రజల పాపములకొరకును దినదినము బలులను అర్పింపవలసిన అవసరము గలవాడు కాడు; తన్ను తాను అర్పించు కొన్నప్పుడు ఒక్కసారే యీ పనిచేసి ముగించెను.

ముగింపు : మీకు ఓర్పు అవసరం అప్పుడే దేవుని చిత్తాన్ని నెరవేరుస్తారు. వాగ్దానాన్ని పొందుతారు:

హెబ్రీ 10:36 **మీరు దేవుని చిత్తమును నెరవేర్చినవారై, వాగ్దానము పొందు నిమిత్తము మీకు ఓరిమి అవసరమైయున్నది.**

**ఆ ఓర్పు నేర్చుకొనే కాలమే lent.**

ఈ లోకంలోనికి దేవుడు నిన్ను నన్ను ఒక మంచి ప్రణాళికతో పంపించారు. కొన్ని బాధ్యతలను మనకు అప్పగించారు. కుటుంబంలో సభ్యునిగా తల్లిగా, తండ్రిగా, భర్తగా, భార్యగా, కుమారుడిగా, కుమార్తెగా, అన్నగా, తమ్ముడిగా, అక్కగా, చెల్లెలుగా, అత్తగా, మామగా, కోడలిగా, అల్లుడిగా మన బాధ్యతలు నెరవేర్చాలి. సంఘ సభ్యునిగా నీవు వెళుతున్న సంఘంలో నీ బాధ్యతలు నెరవేర్చు. భారత దేశ పౌరునిగా దేశము కొరకు దేశ రక్షణ కొరకు నీ బాధ్యత ఏమిటో గుర్తించి నెరవేర్చు. **అలాంటి కృప సర్వాధికారియైన దేవుడు మనకు దయచేయును గాక!......ఆమెన్...ఆమెన్...ఆమెన్......**